సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 3 । నవంబర్ । 2024



తిరుమలకు 22వ సారి పాదయాత్ర

తిరుమలకు అన్నమయ్య కాలిబాటలో తాను 22వ సారి పాదయాత్ర చేస్తున్నట్లు రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. -8లో



గంజాయి ముఠా అరెస్టు

గంజాయి ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. వారి వద్ద 50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.420	రూ.500
రెండోరకం	రూ.300	రూ.410

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 100 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

15న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 15న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆర్టీసీ బస్టాండు నుంచి బస్సులు బయలుదేరుతాయని ఆయన పేర్కొన్నారు. అల్ట్రా డీలక్స్ బస్సులకు రాను, పోను టిక్కెట్టు రూ.805 చెల్లించాలన్నారు. టిక్కెట్లు కావాల్సిన వారు 7382875034, 7981753344, 9440858510ను సంప్రదించాలని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: ఏపీఎస్ఆర్టీసీ కడపలో అప్రెంటిస్ చేయటకు ఆసక్తి కలిగి ఉన్న అభ్యర్థులు ఈ నెల 5వ తేదీ నుంచి 19వ తేదీలోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డీయల్‌టీసీ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నరాజు తెలిపారు. ఈ దరఖాస్తులను www.apprenticeshipindia.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందులో మెకానిక్ డీజిల్ -40, మోటార్ మెకానిక్ వెహికల్-9, ఎలక్ట్రీషియన్ -5, వెల్డర్-2, ఫిట్టర్-3, డ్రాఫ్‌మెట్ సివిల్-1, మెషినిస్టు-5 ఇలా మొత్తంగా 65 ఖాళీలు ఉన్నాయని ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతి అభ్యర్థి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇందులో ఏవైనా సందేహాలు ఉంటే అప్రెంటిస్ షిప్ అడ్వైజర్‌ను సంప్రదించాలని డీఎల్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నరాజు తెలిపారు.

4న కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో గ్రామ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని ఈ నెల 4 న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ వీఆర్ఏ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్ తెలిపారు. శనివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 8 ఏళ్లుగా వీఆర్ఏలకు వేతనాలు పెంచలేదని తెలిపారు. అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ వీఆర్ఏ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్ర, వెంకటపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, జిల్లా కోశాధికారి అశోక్ పాల్గొన్నారు.

వైవీయూ ఎంబీఏ పరీక్షా ఫలితాలు విడుదల



ఎంబీఏ, ఎంబీఏ హెచ్ఆర్ఎం ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, ప్రొఫెసర్లు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఎంబీఏ, ఎంబీఏ హెచ్ఆర్ఎం నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శనివారం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు, ఎంబీఏ విభాగ డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడులతో కలిసి విడుదల చేశారు. వైవీయూలోని తన చాంబర్లో ఫలితాల విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీఏ లో, ఎంబీఏ హెచ్ఆర్ఎం లో వందశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపకులను వీసీ అభినందించారు.

సమస్యల ఘోష

నేడు జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశం

- కరువు కోరల్లో అన్నమయ్య జిల్లా
- తాగునీటి కోసం అల్లాడుతున్న జనం
- ఆగిన అభివృద్ధి అడుగులు
- కృష్ణా జలాల రాక ఇక కలేనా?



లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవులలో ఎండిన వేరుశనగ పంట

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో సమస్యలు ఘోషిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా కరువు పరిస్థితులు చుట్టుముట్టాయి. ఫలితంగా ప్రజలు, పశువులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. జిల్లాలో 8 మండలాల్లో వందల అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీరు లభించకపోవడంతో.. ట్యాంకర్ల సాయంతో అరకొరగా అందిస్తున్నారు. తీవ్ర వర్షాభావం కారణంగా పంటల సాగు గణనీయంగా పడిపోవడంతో.. పశువులకు అవసరమైన మేత కొరత వెంటాడుతోంది. కొత్త జిల్లాగా ఏర్పాటైన నాటి నుంచి వందల కోట్ల రూపాయల నిధుల కేటాయింపుతో పరుగులు తీసిన అభివృద్ధి.. 5 నెలలుగా అడుగులు ముందుకు సాగక కూటమి ప్రభుత్వం నిర్ణయం కోసం ఎదురు చూస్తోంది. కృష్ణా జలాలే శరణ్యంగా మారినా అన్నమయ్య జిల్లాకు కూటమి ప్రభుత్వం వాటి కోసం ఏ మాత్రం చర్యలు చేపట్టలేదు. ఫలితంగా జిల్లాలో శరవేగంగా జరుగుతూ వచ్చిన గండికోట-హంద్రీ నీవా ఎత్తిపోతల పథకం పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఇంకో వైపు ఇసుక, మట్టిని కూటమి నాయకులు దోచుకెళ్తున్నా.. నామమాత్రపు చర్యలతో సరిపెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆదివారం (నేడు) జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో.. ఏ మేరకు చర్చిస్తారు, వాటి పరిష్కారానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రయత్నాలు ఎంత వరకు ఫలిస్తాయో వేచి చూడాల్సిందే. ఈ సమావేశంలో జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితోపాటు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొననున్నారు.

కరువు జాబితా ప్రకటనలో అన్యాయం

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా కరువు విలయతాండవం చేస్తుండగా.. ప్రభుత్వం మాత్రం 19 మండలాలను మాత్రమే కరవు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకొంది. ఖరీఫ్ పంట కాలంలో కీలకంగా భావించే జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో తీవ్ర వర్షాభావం నెలకొన్నప్పటికీ.. కరువు మండలాలను ప్రకటించే విషయంలో ప్రభుత్వం కోతలకు పని చెప్పడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. దుర్భిక్షాన్ని అంచనా వేసి బాధితులను ఆదుకునేందుకు ప్రకటించాల్సిన కరువు మండలాలను తగ్గించింది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావం కారణంగా 40 శాతానికి మించి పంటలు సాగు కాలేదు. సాగైన పంటలకు తగినంత నీరు లేక, వర్షం రాక సరిగా చేతికందలేదు. జిల్లాలో 30 మండలాల్లో కరువు పరిస్థితులు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నా.. కూటమి ప్రభుత్వం మాత్రం 19 మండలాలను మాత్రమే ప్రకటించడంపై జిల్లా రైతులు మండిపడుతున్నారు. కరువు తీవ్ర స్థాయి, మధ్యస్త స్థాయి అని రెండు కేటగిరీలుగా ప్రభుత్వం విభజించినట్లు సమాచారం. కరువు మాన్యువల్ ప్రకారం మండలాలను గుర్తించామని ప్రభుత్వం చెబుతున్నా వాస్తవంలో అదేమీ కనిపించడం లేదు.



కరువు జిల్లాగా ప్రకటించాలి

అన్నమయ్య జిల్లాను పూర్తిగా కరువు జిల్లాగా ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆదివారం జరగనున్న డీఆర్సీ సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు ఈ విషయంపై గళం విప్పాల్సిన అవసరం ఉంది. వర్షపాతం, డ్రైస్పెల్స్, పంటల సాగు, దిగుబడి నష్టం తదితర పలు అంశాలను కరువు మండలాల గుర్తింపునకు పరిగణనలోకి తీసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా డ్రైస్పెల్ మండలాలు గణనీయ సంఖ్యలో ఉన్నాయి. ఆ అంశాన్ని పరిగణనలోకి ప్రభుత్వం తీసుకోలేదన్న విమర్శలు ఉన్నాయి.

రైతులను ఆదుకోవాలి

కరువుతో అతలాకుతలమైన రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రైతులకు రుణ సదుపాయం పొందేందుకు సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా జిల్లా గెజిట్‌లో నిర్దిష్టంగా జిల్లాలను కరువు జిల్లాగా నోటిఫై చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. వర్షాభావ పరిస్థితులు, తాగునీరు, పశువులకు పశుగ్రాసం కొరత, భూగర్భ జలాలు పడిపోవడం, జీవనోపాధి అవకాశాలు లేకపోవడం, వలసల కారణంగా సాగు తగ్గడం వంటి అంశాల ఆధారంగా..



రాయచోటిలోని జగనన్న కాలనీ సమీపంలో చుక్కనీరు లేకుండా కనిపిస్తున్న చెరువు

జిల్లాను కరువు పీడిత ప్రాంతంగా గుర్తించి జిల్లా సమీక్ష సమావేశంలో చర్చించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముందుకు సాగని పనులు



రాయచోటిలో చివరి దశలో ఆగిన క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులు

గత వైఎస్సార్‌సీపీ పాలనలో రాయచోటి జిల్లా కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటుతో పాటు వేల కోట్ల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అదే స్థాయిలో రోడ్లు, పాఠశాలల అభివృద్ధి, కొత్త పాఠశాలలు, కళాశాలల స్థాపన తదితరాలు మంజూరు చేశారు. పట్టణాల అభివృద్ధిలో భాగంగా రోడ్లు, కూడళ్ల విస్తరణను చేపట్టి వాటిని దాదాపు పూర్తి చేశారు. అలాగే పార్కుల ఏర్పాటు, క్రీడల నిర్వహణకు అవసరమైన ఆట స్థలాల నిర్మాణాలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి పథకాల పనులను చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాలన పూర్తిగా కుంటుపడింది. ఫలితంగా రాయచోటి పట్టణానికి అదనంగా వంద కోట్ల రూపాయలతో రూపుదిద్దుకుంటున్న (వెలిగల్లు నుంచి) పైపులైన్ పనులు ఆగిపోయాయి. జిల్లా కేంద్రంలో 80 ఎకరాల్లో అత్యంత సుందరంగా నిర్మిస్తున్న నగరవనం పూర్తి కావాల్సి ఉంది. పట్టణ నడిబొడ్డున, కూడళ్లలో నిర్మించిన సుందరీకరణ, విగ్రహాల ప్రారంభోత్సవాలు ఆగిపోయాయి. రాయచోటి పట్టణానికి సమీపంలో నిర్మిస్తున్న శిల్పారామం పనులు ముందుకు సాగలేదు. క్రీడాకారుల కోసం నిర్మించిన క్రికెట్ స్టేడియం పనులు చివరి దశలో ఉండిపోయాయి. జగనన్న కాలనీలలో జరగాల్సిన మౌలిక వసతుల కల్పన మరుగున పడింది.

వాడివేడిగా వాదోపవాదాలు

- పాలకులను నిలదీసిన సభ్యులు
- జిల్లాను కరువు జాబితాలో చేర్చాలి
- సర్పంచులకు బిల్లులు చెల్లించకుంటే ఆందోళన
- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో రసవత్తరంగా చర్చ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ శారద



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీలు, జిల్లా అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశంలో వాడివేడిగా చర్చ జరిగింది. సమస్యలపై పాలకులను సభ్యులు నిలదీశారు. ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రైతులు సాగు చేసిన పంటలు నిలువునా ఎండిపోయాయని.. జిల్లాను కరువు జాబితాలో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. కడపలో ఉమ్మడి జిల్లాల జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం శనివారం జెడ్పీ చైర్ పర్సన్ జె.శారద అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా మాట్లాడుతూ అధిక దిగుబడులు వస్తాయని అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపిన ఫలితంగా జిల్లా కరువు మండలాల జాబితాలో లేకుండా పోయిందంటూ ధ్వజమెత్తారు. ఈ విషయమై శనివారం 'కరువు రైతుపై కన్నెర్ర' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనాన్ని ఆయన ప్రస్తావించారు. తక్షణమే జిల్లాను కరువు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. జెడ్పీ ఉపాధ్యక్షుడు బాలయ్య కూడా దీనికి మద్దతు తెలిపారు. కరువుతో రైతులు సర్వస్వం కోల్పోగా వ్యవసాయాధికారులు మాత్రం 33 శాతం కంటే పంట దిగుబడి అధికంగా వస్తుందంటూ నివేదికలు ఎలా పంపుతారని వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావును నిలదీశారు. ఇందుకు జేడీ బదులిస్తూ కరువున్న మాట నిజమేనని, అయితే కరువును నిర్ధారించే ఇండికేటర్స్ అనుకూలించలేదని తెలిపారు. జిల్లాలో ఒకచోట వర్షం కురుస్తుంటే అతి సమీప ప్రాంతంలో పడదని తెలిపారు. రానున్న రోజుల్లో ఒక మండలంలో నాలుగు చొప్పున రెయిన్‌గేజ్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. దీంతో మండలంలో కురిసిన సగటు వర్షపాతం కచ్చితంగా అంచనా వేసే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం కరీముల్లా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి మళ్లీ ప్రభుత్వానికి నివేదికలు పంపడం ద్వారా జిల్లా కరువు జాబితాలో చేరేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ గతంలో సర్పంచులు రహదారులు, డ్రైనేజీ తదితర పనులు చేశారని తెలిపారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా నిలిపి వేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించేందుకు చర్యలు చేపట్టకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఏడేళ్ల క్రితం భవనాలు నిర్మించినా ఏపీఆర్ఐసీ బిల్లులు చెల్లించడం లేదని పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ తెలిపారు. జెడ్పీ నిధులు ఇస్తామన్నప్పటికీ ఆ శాఖ అధికారులు అంగీకరించడం లేదన్నారు. టేకూరుపేట హాస్టల్ 2016లో మూసి వేయడం వల్ల సుమారు 500 మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. తక్షణమే హాస్టళ్లు పునః ప్రారంభించాలని కోరారు. జిల్లాలోని షాదీఖానాలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారాయని కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా విమర్శించారు. అద్దె ఎవరువసూలు చేస్తున్నారో, ఏ అకౌంటులో జమ చేస్తున్నారని చెప్పాలని మైనార్టీ సంక్షేమశాఖ అధికారిని నిలదీశారు. గ్రావెల్ రవాణాకు అనుమతులు ఇవ్వాలని పోరుమామిళ్ల జెడ్పీటీసీ కోరారు. గ్రీన్ ఎంబాసిడర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. ఇందుకు డీపీఓ బదులిస్తూ సర్పంచులతో సంప్రదించి వేతనాలు ఇప్పిస్తామన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

శివాలయాలకు కార్తీక శోభ



శివభక్తులకు ఎంతో ప్రియమైన కార్తీక మాసం వచ్చేసింది. ప్రత్యేక పూజలతో.. కార్తీక దీపాలతో శివాలయాలు కళకళలాడనున్నాయి. ఇప్పటికే పవిత్ర కార్తీక మాసం ప్రారంభమైందని చాటుతూ ఆయా ఆలయాల ధ్వజస్తంభాలపై కార్తీక దీపాన్ని వెలిగించారు. ఆకాశ దీపాన్ని ఎగురవేశారు. రేపు కార్తీక తొలి సోమవారం కోసం ఆయా ఆలయాల్లో అన్ని ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. -సాక్షి, నెట్‌వర్క్

'చిరుద్యోగులపైనే చర్యలు'

- సంచలనం రేపుతున్న అర్బన్ స్టేషన్ కానిస్టేబుల్ వాయిస్ మెసేజ్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : 'ఎస్ఐ, సీఐ స్థాయి అధికారులు ఎంత పెద్ద అవినీతికి పాల్పడినా వారిపై చర్యలు ఉండవు. కానిస్టేబుల్ స్థాయి చిరుద్యోగి చిన్న తప్పు చేసినా వెంటనే చర్యలు ఉంటాయి' బద్వేలు అర్బన్ స్టేషన్‌లో పనిచేస్తూ శుక్రవారం సస్పెండ్‌కు గురైన కానిస్టేబుల్ నాగసుబ్బయ్య (పి.సి.నెం. 2797) వాయిస్ మెసేజ్ ఇది. పోలీసు వాట్సాప్ గ్రూపులో పెట్టిన ఈ మెసేజ్ ప్రస్తుతం సంచలనంగా మారింది. స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్‌లో నాగసుబ్బయ్య (పి.సి.నెం. 2797) గత కొన్ని నెలలుగా పని చేస్తున్నాడు. అయితే ఇటీవల మడకలవారిపల్లె సమీపంలో ఎలక్ట్రికల్ వస్తువులు విక్రయించే వారి వద్ద సదరు కానిస్టేబుల్ రూ.25 వేలు డబ్బులు అక్రమంగా తీసుకున్నట్లు అర్బన్ సీఐ రాజగోపాల్ దృష్టికి వచ్చింది. ఈ మేరకు విచారణ జరిపి నివేదికను ఎస్పీకి పంపడంతో ఆయన శుక్రవారం సదరు కానిస్టేబుల్ నాగసుబ్బయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఈ వ్యవహారంపై కానిస్టేబుల్ నాగసుబ్బయ్య వివరణ ఇస్తూ పోలీసుల వాట్సాప్ గ్రూప్‌లోకి పంపిన వాయిస్ మెసేజ్ సంచలనంగా మారింది. అందులో అర్బన్ స్టేషన్ సీఐ రాజగోపాల్ జరిగిన విషయంపై న్యాయమా, అన్యాయమా అనేది తెలుసుకోకుండా తనపై రిపోర్టు పెట్టారని, అలాగే పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని వాయిస్ మెసేజ్‌లో పెట్టారు. ఇటీవల దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసేందుకు లైసెన్సుల కోసం దరఖాస్తులు చేసుకున్న వ్యాపారుల వద్ద నుంచి ఓ కానిస్టేబుల్ ద్వారా పెద్ద మొత్తంలో అక్రమంగా నగదు వసూలు చేసినట్లు సదరు కానిస్టేబుల్ ఆరోపించారు.

ఆపద్బాంధవుల ఆకలికేకలు

ఆపద సమయంలో అత్యవసర వైద్య సేవలందించే 108 వాహనాల సిబ్బందికి పెద్ద కష్టాలొచ్చాయి.. మూడు నెలల నుంచి వేతనాలు అందలేదు.. ఇచ్చే కొంత మొత్తంతోనే కుటుంబాలను పోషిస్తున్నామని, అది కూడా నెల వారీగా ఇవ్వకపోతే ఎలా జీవనం సాగించాలని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా ప్రభుత్వం వారి మొర ఆలకించినట్టు లేదు. ఎందుకంటే కనీసం దసరా, దీపావళి పండుగల పూటైనా.. పాలకులు దయ చూపుతారని ఆశించినా నిరాశే మిగిలింది.

- 108 సిబ్బందికి మూడు నెలల జీతాలు పెండింగ్
- కుటుంబం గడవక తీవ్ర ఇక్కట్లు
- పట్టించుకోని ప్రభుత్వం



బి.కొత్తకోట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమల్లోకి తెచ్చిన 108 అంబులెన్సులు ప్రజలకు సేవలు అందించడంలో ముందున్నాయి. వీటిని ప్రారంభించక మునుపు అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్లాలంటే.. అద్దె వాహనాల కోసం గంటల తరబడి ఎదురుచూసి వారి చెప్పిన అద్దెను చెల్లించాల్సి వచ్చేది. ఆ దయనీయ పరిస్థితి నుంచి ఈ అంబులెన్సులు గట్టెక్కించాయి. పైసా ఖర్చు లేకుండా, జాప్యం లేకుండా ఫోన్ చేసిన నిమిషాల్లోనే చేరుకుంటూ.. వైద్య సేవల్లో కీలకంగా మారిపోయాయి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన అంబులెన్స్‌ల విధుల్లో ఉంటున్న ఉద్యోగులకు ప్రభుత్వం వేతనాల చెల్లింపులో జాప్యం చేస్తోంది. చిరుద్యోగులైన అంబులెన్స్ టెక్నీషియన్, పైలట్లకు ఈ అక్టోబర్‌తో కలిపి మూడు నెలల జీతాలు అందాల్సి ఉంది.

32 అంబులెన్స్‌ల్లో 160 మంది విధులు

అన్నమయ్య జిల్లాలోని 30 మండలాలకు ఒక్కో అంబులెన్స్ చొప్పున 30 ఉన్నాయి. ఒక అంబులెన్స్ నవజాత శిశువుల కోసం, ఒకటి అత్యవసర పరిస్థితుల్లో వినియోగం కోసం ఉంది. ఈ 32 అంబులెన్స్‌లకు సంబంధించి ఒక్కో అంబులెన్స్‌కు ఒక్కో ఉద్యోగి 12 గంటలు పని చేయాలి. ఒక టెక్నీషియన్ (ఈఎంటీ), ఒక పైలట్ (డ్రైవర్) 12 గంటలు, ఇంకో ఇద్దరు మరో 12 గంటలు విధుల్లో ఉంటారు. ప్రతి రెండు అంబులెన్స్‌లకు కలిపి అదనంగా ఒక టెక్నీషియన్, ఒక పైలట్ ఉంటారు. 8 ఏళ్లపైబడి అనుభవం కలిగిన టెక్నీషియన్లకు రూ.30 వేలు, ఐదేళ్లలోపు అనుభవం కలిగిన వారికి రూ.16 వేలు, 8 ఏళ్లకుపైబడిన అనుభవం కలిగిన పైలట్లకు రూ.28 వేలు, ఐదేళ్లలోపు అనుభవం కలిగిన పైలట్లకు రూ.16 వేలు వేతనంగా చెల్లిస్తున్నారు. వీరికి ప్రతి నెలా 4 నుంచి 8వ తేదీలోపు జీతాలు చెల్లిస్తారు. జూలై వేతనం ఆలస్యంగా చెల్లించారు. ఆగస్టు, సెప్టెంబర్‌తోపాటు ప్రస్తుత అక్టోబర్ నెలను కలుపుకొంటే మూడు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది.

97 వేల మందికి సేవలు

జిల్లాలో పని చేస్తున్న 108 అంబులెన్సుల సిబ్బంది 97,823 మంది ప్రజలకు సేవలు అందించారు. 2022 అక్టోబర్ నుంచి 2023, ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఈ సేవలు అందించారు. ప్రమాద బాధితులు, గర్భిణులు, కిడ్నీ బాధితులు, వివిధ ఆరోగ్య సమస్యలతో వైద్యం కోసం వెళ్లాల్సిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించారు. బాధితులకు సిబ్బంది అంబులెన్స్‌లలోనే అందుబాటులోని వైద్య సేవలను అందిస్తూ ప్రాణాపాయం నుంచి తప్పించి ఆస్పత్రులకు చేరుస్తారు.

అంబులెన్స్ సేవలు పొందిన బాధితుల సంఖ్య

నెల	2022	2023	2024
జనవరి	--	3,485	4,547
ఫిబ్రవరి	--	3,968	4,431
మార్చి	--	3,882	4,181
ఏప్రిల్	--	3,344	4,571
మే	--	4,378	4,012
జూన్	--	4,121	3,957
జూలై	--	4,319	3,828
ఆగస్టు	--	4,493	3,786
సెప్టెంబర్	--	4,203	3,626
అక్టోబర్	3,685	4,465	--
నవంబర్	3,966	4,359	--
డిసెంబర్	3,781	4,435	--

పండుగల ఖర్చులకు ఇబ్బందులు

దసరా, దీపావళి పండుగల వేళల్లో.. తమ ఖాతాల్లో వేతనాలు జమ చేస్తారేమోనని ఎదురుచూశారు. అయినా వారి ఆశలు అడియాసలయ్యాయి. చిరు వేతనాలు అందుకునే సిబ్బంది వచ్చే వేతనంతోనే కుటుంబాన్ని పోషించుకోవాలి. నెలనెలా వేతనాలు అందితే ఒకలా, లేకుంటే పరిస్థితులు మరోలా ఉంటాయి. జీతాలు అందితేనే.. కుటుంబాన్ని ఎలా గోలా గట్టెక్కించవచ్చు. లేకపోతే అప్పుల పాలు కావాల్సిందే. నెలలో ఏవైనా పండుగలు వస్తే.. అదనంగా ఖర్చులు అవుతాయి. అక్టోబర్‌లో దసరా, దీపావళి.. రెండూ పెద్ద పండుగలు వచ్చాయి. ఎంత సర్దుకుని ఖర్చులు చేసినా.. తడిసిమోపెడయ్యాయి. పిల్లలకు టపాకాయలు కొనుగోలు చేయడానికి తీవ్ర ఇబ్బంది పడ్డారు. కొందరు కొనుగోలు చేయలేక పోవడంతో.. పిల్లలు తీవ్రంగా బాధ పడ్డారు. దీంతో వారి కుటుంబాల్లో పండుగల కళ కనిపించలేదు. చిరుద్యోగులు కావడంతో అప్పులు కూడా లభించక.. కొన్ని కుటుంబాలు పస్తులుంటున్నాయి. దీంతో ఇప్పటికైనా తమకు వేతనాలు చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

క్లుప్తంగా

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : మదనపల్లె పట్టణం బాబూకాలనీకి చెందిన అహ్మద్‌బాషా కుమారుడు మహబూబ్‌బాషా(30) భార్య కాపురానికి రాలేదన్న మనస్తాపంతో శుక్రవారం రాత్రి ఎలుకల మందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

మదనపల్లె : దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. పట్టణంలోని దేవతానగర్‌కు చెందిన ట్యాక్సీ డ్రైవర్ పఠాన్ మహమ్మద్‌బాషా(45) శుక్రవారం రాత్రి కారును శ్రీ శ్రీనివాస బజాజ్ షోరూమ్ ఎదుట పార్క్ చేశాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న పవన్, అతడి స్నేహితులు మహమ్మద్‌బాషాతో గొడవ పడి గాయపరిచారు. విషయం తెలుసుకున్న మహమ్మద్‌బాషా కుమారుడు, కుమార్తె, బంధువులు ఘటనాస్థలంకు వెళ్లి పవన్‌ను నిలదీశారు. దీంతో అతడు మహమ్మద్ బాషా కుమారుడిపై దాడికి పాల్పడ్డాడు. దాడిలో గాయపడిన మహమ్మద్‌బాషా, కుమారుడిని స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. శనివారం మహమ్మద్‌బాషా కుమార్తె సబీహా దాడి ఘటనపై తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దాడికి పాల్పడ్డ పవన్, అతడి స్నేహితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆన్‌లైన్ గేమ్‌లతో ఆత్మహత్యాయత్నం

కురబలకోట : ఆన్‌లైన్ గేమ్‌ల బారిన పడి అప్పుల పాలై ఓ యువకుడు ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డ సంఘటన శనివారం కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..మండలంలోని పిచ్చలవాండ్లపల్లెకు చెందిన రెడ్డి కిరణ్ రెడ్డి (23) ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి డబ్బు పోగొట్టుకున్నాడు. దీనికి తోడు అప్పులు తీర్చడానికి బైక్‌ను రూ.50 వేలకు వడ్డీ వ్యాపారికి కుదువపెట్టాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మందిలించారు. మనస్తాపానికి గురైన అతడు ఇంటిలోని పురుగు మందు తాగి శనివారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. హుటాహుటిన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి ముఠా అరెస్టు

- రూ.10లక్షల విలువ చేసే గంజాయి స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్టు
- ఒక కారు, సుమో సీజ్
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



గంజాయితో పాటు నిందితులను చూపుతున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి టౌన్ : గంజాయి ముఠాను అరెస్టు చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్‌హెచ్ (నేషనల్ హైవే)పై గత రాత్రి డీఎస్పీ సుధాకర్, కోడూరు రూరల్ సీఐ పి. వెంకటేశ్వర్లు, అర్బన్ సీఐ శ్రీధర్ రావు, రాజంపేట ఎస్ఐ బివి రమణ, మహేష్‌లు వాహనాలు తనిఖీ నిర్వహించారని తెలిపారు. తనిఖీలలో భాగంగా అనుమానంగా వచ్చిన ఏపీ04 డబ్ల్యూ 9662 నంబర్ గల సుమో, డీఎల్ 5992 నంబర్ గల కారు వచ్చాయని తెలిపారు. అనుమానంతో వాటిని ఆపే ప్రయత్నం చేయగా రెండు వాహన డ్రైవర్లు ఓవర్ స్పీడ్‌తో ముందుకెళ్లారని, దీంతో ఎస్ఐ కూడా వారిని ఆపేప్రయత్నంలో రోడ్డుపై పడటంతో చెయ్యికి గాయం కూడా అయ్యిందన్నారు. ఎట్టకేలకు రెండు వాహనాలను, అందులో ఉన్న కల్లపల్లె నాగేంద్ర, కె. కుమారి, షేక్ సలీం బాషా, బాపురాజన్ అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నలుగురిని విచారించామన్నారు. ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి రాజంపేటతో పాటు చిత్తూరు, తిరుపతి ప్రాంతాలలో అమ్మడంతో పాటు అక్కడ నుంచి ఇతరా రాష్ట్రాలకు కూడా సరఫరా చేసేవారని తేలిందన్నారు. పట్టబడిన వారిలో పుల్లంపేటకు చెందిన కల్లపల్లె నాగేంద్ర ఉన్నట్లు చెప్పారు. ఇతడు గతంలో నాలుగు ఎర్రచందనం, నాలుగు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నారన్నారు. తిరుపతికి చెందిన కె. కుమారి కూడా నిందితురాలు ఉన్నట్లు తెలిపారు. ఆమె కూడా గతంలో రెండు గంజాయి కేసులో నిందితురాలిగా ఉందన్నారు. అలాగే చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన షేక్ సలీం బాషా నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నిందితుడు గతంలో ఆరు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నాడన్నారు. వీరితో పాటు కేరళ రాష్ట్రానికి చెందిన బాపురాజన్ కూడా ఉన్నాడని, అతని వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యక్తి కూడా రెండు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు స్పష్టం చేశారు. వీరి వద్ద స్వాధీనం చేసుకున్న మొత్తం గంజాయి 50 కిలోల వరకు ఉంటుందని, దీని ధర సుమారు రూ.10 లక్షలు చేస్తుందని వివరించారు. వీరిపై చట్టపరమైన కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి మత్తు పదార్థాలను అమ్మినా.. కొన్నా నేరమేనన్నారు. అమ్మినవారిపైనే కాదు కొన్న వారిపై కూడా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గ్రామాలు, పట్టణాల్లో మత్తు పదార్థాలు (గంజాయి వంటివి) అమ్ముతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. వారి పేర్లు గోప్యంగా ఉంచి నిందితులపై కేసులు నమోదు చేస్తామన్నారు. మత్తుకు బానిసలుగా ఉన్న వారి వివరాలు తెలియచేస్తే అలాంటి వారికి కౌన్సెలింగ్ ఏర్పాటు చేసి మంచి ప్రవర్తనతో జీవించే విధంగా ప్రయత్నం చేస్తాన్నారు. యువతను మంచి బాటలో నడిపించే విధంగా భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని, అందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. చట్టప్రకారం గంజాయి, రవాణా చేసినా, నిల్వ చేసినా అలాంటి వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

– చికిత్స పొందుతూ మరొకరు మృతి



మృతి చెందిన గడిబోయిన ప్రవీణ్

సిద్దవటం : మండలంలోని జేఎంజే కళాశాలకు సమీపంలో ఉన్న కోతుల మోరీ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజంపేట మండలం ఇసుకపల్లి గ్రామానికి చెందిన గడిబోయిన ప్రవీణ్ (19)అక్కడికక్కడే మృతి చెందగా, కొండూరు రోహిత్ కుమార్‌రాజు(19) తీవ్రగాయాలతో కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెట్రోలింగ్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా.. కడప నుంచి గడిబోయిన ప్రవీణ్, కొండూరు రోహిత్ కుమార్‌రాజు బైక్‌లో రాజంపేటకు వెళ్తున్నారు. జేఎంజే కళాశాలకు సమీపంలోని కోతుల మోరి వద్దకు రాగానే ముందు వెళుతున్న కారును తప్పించబోయి కింద పడ్డారు. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు కింద ప్రవీణ్ పడి అక్కడి కక్కడే మృతి చెందాడు. రోహిత్ కుమార్‌రాజు తీవ్రగాయాలు కాగా కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ చిరంజీవి పరిశీలించారు.

అన్నమయ్య కాలిబాటలో 22వసారి పాదయాత్ర

- కాలిబాటలో వెళ్లి శ్రీవారిని దర్శించుకోవడం మహాభాగ్యం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



గోవిందమాల ధరించి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి

రాజంపేట : పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు తిరుమలకు నడిచివెళ్లిన కాలిబాటలో 22వ సారి పాదయాత్ర చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. శనివారం ఆకేపాడు దేవాలయాల సముదాయాలలో ఉన్న అలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందమాలను కుటుంబ సమేతంగా ధరించారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కలియుగ దైవం ఏడుకొండలస్వామిని అన్నమయ్య కాలిబాటలో భక్తులతో కలిసి కొండకు చేరుకుని దర్శించుకునే మహాభాగ్యం తనకు లభించడం పూర్వ జన్మ సుకృతమన్నారు. తాళ్లపాక అన్నమాచార్యులు జన్మించిన స్థలం తాళ్లపాక రాజంపేట మండలంలో ఉండటం ఈ ప్రాంతీయుల అదృష్టమన్నారు. 22వ తిరుమల మహాపాదయాత్ర కార్యక్రమాలను వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుడిపై దౌర్జన్యం

పుల్లంపేట : పుల్లంపేట మండలం, శ్రీరాములపేటకు చెందిన రమణ అనే వ్యక్తి విద్యుత్ కాంట్రాక్టు కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం కేతరాజుపల్లి, దళవాయిపల్లి గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు తమ గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందని తనపై దౌర్జన్యం చేసి గాయపరిచారని విద్యుత్ కాంట్రాక్టు కార్మికుడు రమణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై పుల్లంపేట ఏఎస్ఐ పిచ్చయ్యను వివరణ కోరగా విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నాబిడ్డను వెతికిపెట్టి న్యాయం చేయండి సారూ..!

కమలాపురం : తన 14 ఏళ్ల మైనర్ బాలికను తన తోడి కోడలు రాధ వెంట తీసుకెళ్లిందని, ఇప్పటి వరకు తీసుకు రాలేదు. తన బిడ్డ ప్రాణంతో ఉందో లేదో కూడా తెలియడం లేదని, తనకు న్యాయం చేయండి సారూ.. అని మైనర్ బాలిక తల్లి ఆదిలక్ష్మీ కన్నీటి పర్యంతం అవుతోంది. వివరాల్లోకి వెళితే.. కమలాపురం పట్టణం చెప్పలి రోడ్డులో ఉన్న వలస కార్మికులైన ఆదిలక్ష్మీ గత కొంత కాలంగా కమలాపురంలోనే నివాసం ఉంటున్నారు. అయితే వరుసకు తోడి కోడలు అయిన రాధా తన 14ఏళ్ల కుమార్తెను కుట్టు మిషన్ వద్దకు పోయి వస్తామని బుధవారం తీసుకెళ్లిందని, ఇంత వరకు తన కూతురిని తీసుకు రాలేదని వాపోయింది. అసలు నా బిడ్డ ప్రాణంతో ఉందో, లేదో తెలియడం లేదని ఆమె రోదిస్తోంది. తన మేనల్లుడికి ఇచ్చి వివాహం చేయాలనే ఉద్దేశంతోనే రాధా తన కూతురిని తీసుకెళ్లిందని, తన కుమార్తెను తీసుకువచ్చి అప్పగించాలని ఆమె పోలీసులు ఎదుట వాపోయింది. ఈ విషయమై ఎస్ఐ ప్రతాప్‌రెడ్డిని వివరణ కోరగా బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

కమలాపురం : ఏడాది క్రితం జరిగిన హత్య కేసులో ముద్దాయిలను చాక చక్యంగా అరెస్ట్ చేసినట్లు కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్ తెలిపారు. శనివారం కమలాపురం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో హత్య కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో నిందితులను ఆరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. 2023 డిసెంబర్ 30వ తేదీన మైదుకూరు మండలం, శెట్టిపల్లెకు చెందిన దత్తలూరు పీరయ్యను అతని భార్య హుసేనమ్మ తన ప్రియుడు నేరెళ్ల ఆల్ఫ్రెడ్ అలియాస్ రాముడుతో కలసి హత్య చేసింది. హుసేనమ్మకు వివాహం కాక ముందు నుంచి మైదుకూరు మండలం పప్పనపల్లెకు చెందిన రాముడుతో పరిచయం ఉంది. అలాగే వారి మధ్య అక్రమ సంబంధం నడుస్తోంది. ఈ విషయం తెలిసిన మృతుడు పీరయ్య పలు మార్లు భార్య హుసేనమ్మతో ఘర్షణ పడేవాడు. మృతుని అడ్డు తొలగించుకోవాలని చూస్తున్న వారు గత ఏడాది డిసెంబర్ 30న మద్యం మత్తులో ఉన్న పీరయ్యను ఆటోలో ఎక్కించుకుని మైదుకూరు టౌన్, ప్రొద్దుటూరు నుంచి కడపకు వెళ్లే బైపాస్ రోడ్డు లోని మూలబాట వీధికి పోవు సర్వీసు రోడ్డు దగ్గరికి తీసుకెళ్లి ఇనుపరాడ్డుతో కొట్టి, నైలాన్ తాడుతో మెడకు ఉరి బిగించి హత్య చేశారు. అనంతరం శవాన్ని కడప ఎయిర్ పోర్ట్ దగ్గర ఉన్న పెద్ద కులాయిరెడ్డి లే-అవుట్‌లోని కంప చెట్లలో పడేశారు. హత్య జరిగిన ఐదు రోజులకు శవం బయటపడింది. మృతుని చేతిపై డి.సిద్ధేశ్వరమ్మ అనే పచ్చ బొట్టు ద్వారా మృతుడిని గుర్తించారు. ఈ ఘటనపై వల్లూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అయితే హత్య చేసిన హుసేనమ్మ, రాముడు తమకు తెలిసిన వారెవరితో సంబంధాలు పెట్టుకోకుండా జమ్మలమడుగులో నివాసం ఉంటున్నారు. సీఐ రోషన్, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి కలసి విచారణ చేపట్టి నిందితులను గుర్తించారు. వారిని శనివారం మైదుకూరు టౌన్ మూలబాట వీధి సర్వీస్ రోడ్డు వద్ద పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా ఈ కేసును చేధించిన సీఐ, ఎస్ఐతో పాటు కానిస్టేబుల్స్ మధు సూదన రాజు, నాగరాజులను ఎస్పీ అభినందించారు.

గంజాయి విక్రయ కేంద్రంగా ఓబులవారిపల్లె

ఓబులవారిపల్లె : గంజాయి విక్రయాలకు కేంద్రంగా ఓబులవారిపల్లె మండలం మారింది. వ్యసనాలకు బానిసైన యువత, కొంతమంది కార్పొరేట్ ఉద్యోగులు మత్తుకోసం గంజాయిని అలవాటు చేసుకున్నారు. ఇటీవల మండలంలో గంజాయి విక్రయాలు పెరగడంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో పెద్ద ఎత్తున గంజాయి పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా అంతర్ రాష్ట్ర గంజాయి ముఠాను మండలంలో పోలీసులు అరెస్టు చేయడం సంచలనంగా మారింది. వారివద్ద నుంచి పెద్దఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ముఠా ప్రధానంగా యువత ఉద్యోగులకు గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు జరుపుతున్నారు. బానిసైన వారి నుంచి ఎక్కువగా డిమాండ్ పెరిగింది. దీంతో అంతర్ రాష్ట్ర ముఠా దృష్టి జిల్లాపై పడింది. ఇటీవల యల్లాయపల్లె క్రాస్ రోడ్డు వద్ద గంజాయి అమ్ముతున్న నరసయ్యను పోలీసులు అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 750 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మళ్లీ శనివారం మంగంపేట చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద 50 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అంతర్ రాష్ట్ర ముఠాను అరెస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది.

చైన్ స్నాచర్ అరెస్టు

70.5 గ్రాముల బంగారు గొలుసులు, రెండు బైకులు స్వాధీనం



చైన్ స్నాచర్ అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్

మైదుకూరు : పలు చోట్ల మహిళల మెడలోని బంగారు గొలుసులను లాక్కెళ్లిన ఓ చైన్ స్నాచర్‌ను మైదుకూరు అర్బన్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.6.68 లక్షల విలువైన 70.5 గ్రాముల బంగారు గొలుసులను, రెండు మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తన కార్యాలయంలో ఆ వివరాలను వెల్లడించారు. కడప నగరంలోని మోచంపేట వీధికి చెందిన షేక్ అజాంఆలీ సేట్ అలియాస్ సేట్ మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి మెడలో ఉన్న బంగారు ఆభరణాలను లాక్కొని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఇటీవల దసరా ఉత్సవాల్లో మైదుకూరు మున్సిపాలిటీలోని లింగాలదిన్నెకు చెందిన భూమిరెడ్డి వెంకట రాధ దైవదర్శనం కోసం మైదుకూరుకు వచ్చింది. స్థానిక అమ్మవారిశాల వద్ద నిలుచుని ఉండగా మోటార్ బైక్‌పై వచ్చిన అగంతకుడు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన అర్బన్ పోలీసులు శనివారం షేక్ అజాం ఆలీ సేట్‌ను పట్టుకున్నారు. ఇతను మైదుకూరులో, ప్రొద్దుటూరు 2వ పోలీస్‌స్టేషన్ పరిధిలో, అన్నమయ్య జిల్లా మన్నూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. అతని వద్ద నుంచి రెండు మోటార్ బైక్‌లతోపాటు 19 గ్రాములు, 20 గ్రాములు, 16.450 గ్రాముల బరువు ఉన్న మూడు బంగారు గొలుసులతోపాటు 20 గ్రాముల నల్లపూసల దండను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పార్కింగ్ చేసిన మోటార్ బైకులను ఎత్తుకెళ్లే ఆజాం ఆలీ అదే బైక్‌లపై ప్రయాణిస్తూ మహిళల మెడలోని గొలుసులను లాక్కెళుతుంటాడని తెలిపారు. ఇతనిని పట్టుకొని చోరీ చేసిన బంగారు ఆభరణాలతోపాటు, మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకునేందుకు కృషి చేసిన మైదుకూరు అర్బన్ సీఐ సయ్యద్ హాసం, ఎస్ఐ బి.ఘన మద్దిలేటి, హెడ్ కానిస్టేబుల్ సీహెచ్‌వీ రమణ, శివగణేష్, నవీన్, తిరుమలయ్యలను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు



గాయపడిన వృద్ధురాలు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దూదేకులవీధిలో శనివారం ఓ వృద్ధురాలిపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో వృద్ధురాలికి రెండు కాళ్ళకు తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని కొండారెడ్డివీధికి చెందిన సుబ్బమ్మ అనే వృద్ధురాలు ఓ పని నిమిత్తం దూదేకులవీధిలోని తన సమీప బంధువుల ఇంటికి వచ్చింది. అక్కడ పని ముగించుకుని తిరిగి వెళుతున్న సమయంలో ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. చుట్టుపక్కల వారు వారిస్తున్నా దాడి చేయడంతో రెండు కాళ్ళకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా రక్తస్రావం అవుతుండటంతో భయాందోళనకు గురైన ఆ వృద్ధురాలు అయ్యా... నాకు ముందే ఆరోగ్యం బాగా లేదు. త్వరగా ఆసుపత్రిలో చేర్పించండి అంటూ అక్కడి వారిని చేతులెత్తి మొక్కుతూ వేడుకోవడం కలచివేసింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. అనంతరం వృద్ధురాలి కుటుంబ సభ్యులు ఆమెకు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేర్పించారు.

గండి క్షేత్రం వద్ద స్కార్పియో దగ్ధం



వాహనంలో చెలరేగిన మంటలు

చక్రాయపేట : అంజన్న దర్శనం నిమిత్తం అట్లూరు నుంచి వచ్చిన స్కార్పియో వాహనం గండి క్షేత్రంలో దగ్ధమైంది. ఏసీ వైర్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా స్కార్పియోలో మంటలు చెలరేగినట్లు వాహన యజమానితో పాటు భక్తులు పేర్కొన్నారు. వివరాలు ఇలా.. అట్లూరు మండలం పాత అట్లూరు గ్రామానికి చెందిన మన్నూరు నరసింహ ఏపీ13 బీయు 0349 స్కార్పియోలో కుటుంబ సభ్యులతో కలిసి శనివారం గండికి వచ్చాడు. వాహనాన్ని అర్చకుల నివాస గృహాల వద్ద ఆపి అందరూ స్వామి దర్శనానికి వెళ్లారు. ఆ సమయంలో ఒక్కసారిగా వాహనం లోపలి నుంచి దట్ట మైన పొగలతో పాటుగా మంటలు వచ్చాయి. ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ వెంకటస్వామి, ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, సిబ్బంది, ఆర్కేవ్యాలీ పోలీసులు భక్తులను దూరంగా పంపించివేశారు. ప్రధాన, ఉపప్రధాన అర్చకులు కేసరి, రాజారమేష్‌ల ఇళ్లలోని కుళాయి పైపులతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అంతలోనే వేంపల్లె అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేసింది.

వ్యాయామంతో మరింత మెరుగ్గా ఆరోగ్యం



వ్యాయామశాల పునః ప్రారంభించిన వైద్యాధికారులు

కడప అర్బన్ : ప్రతి ఒక్కరూ వ్యాయామం అలవర్చుకోవాలి. వ్యాయామంతో ఆరోగ్యం మరింత మెరుగ్గా వుంటుందని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డీఎంఈ డాక్టర్ ఏ. సురేఖ అన్నారు. శనివారం కళాశాలలోని వ్యాయామశాలను మళ్లీ ప్రారంభించారు. కరోనా ముందు వరకు వ్యాయామశాలను అందరూ ఉపయోగించుకునేవారు. తరువాత మరింత ఆధునికంగా వ్యాయామశాలను తీర్చిదిద్ది పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వ్యాయామం ప్రతి వైద్య విద్యార్థి అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్, సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ (అకడమిక్) డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ (అడ్మినిస్ట్రేటివ్) డాక్టర్ బి. లక్ష్మీ నరసమ్మ, అధ్యాపక సిబ్బంది, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌లో న్యాయమూర్తులకు ముందస్తు జాతీయ లోక్ అదాలత్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిసెంబర్ 14వ తేదీన జరుగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ కోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ఏర్పాట్లు చేయాలి



పెద్ద దర్గా ప్రతినిధులతో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి


కడప కార్పొరేషన్ : నగరంలోని మున్సిపల్ మైదానంలో ఈనెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించి అన్ని ఏర్పాట్లు ఈనెల 6వ తేదీకి పూర్తి కావాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన మున్సిపల్ మైదానాన్ని పరిశీలించారు. ఆర్మీ అధికారులు బస చేయడానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఇందులో నగరపాలక సంస్థలోని ప్రతి విభాగానికి బాధ్యతలు అప్పగించారు. రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే వారికి వాష్ రూములు వంటి ఏర్పాట్లను చూసే బాధ్యత శానిటేషన్ అధికారులకు అప్పగించారు. ప్రోటోకాల్, ఫుడ్, స్నాక్స్ వంటి వాటి బాధ్యతలను రెవెన్యూ విభాగం అధికారులకు అప్పగించారు. సైనింగ్ బోర్డులు, ఆక్రమణల తొలగింపు బాధ్యతలను టౌన్‌ప్లానింగ్ అధికారులకు కేటాయించారు.

పెద్దదర్గా వద్ద..

అలాగే పెద్ద దర్గా చుట్టు పక్కల పరిశుభ్రమైన వాతావరణం కనిపించాలని, రాత్రివేళ జనం రద్దీగా ఉంటారని, తెల్లారే సరికి చెత్త పాయింట్లు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లి ఉంచాలన్నారు. ఉరుసుకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నిద్రావస్థలో కూటమి ప్రభుత్వం

- సీఎం సొంత జిల్లాలో వరుస అత్యాచారాలు, హత్యలు
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



అట్లూరు : కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సొంత జిల్లాలో చిన్నారులపై వరుస అత్యాచారాలు, ఆపై హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం నిద్రావస్థలో ఉందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. శనివారం ఆయన పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం ఏఎం పురంలో మూడేళ్ల చిన్నారికి చాక్లెట్లు కొనిస్తానని మాయమాటలు చెప్పి సుశాంత్ అనే యువకుడు అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఆ తల్లి దండ్రుల బాధలు వర్ణణాతీతమని, ఎన్నో నోములు నోచుకుని పిల్లలను కంటే వారిని చిన్న తనంలోనే చిదిమేస్తే తల్లి దండ్రులు తట్టుకోగలరా?. ఈ ప్రభుత్వం ఇక నైనా నిద్రలేవాలని పేర్కొన్నారు. ఇలాంటి అత్యాచారాలు హత్యలు ఆంధ్రప్రదేశ్‌లో తప్ప ఎక్కడా జరగలేదన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ఈ ఘటన జరిగిందన్నారు. మద్యం షాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేయడం వలనే మద్యం మత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇప్పటికైనా మద్యం షాపులు తగ్గించి బెల్టుషాపులను పూర్తిగా లేకుండా చేయాలన్నారు. రాష్ట్రంలో గంజాయి విచ్చల విడిగా దొరుకుతోందన్నారు. డిప్యూటీ సీఎం సొంత జిల్లాలో 16 ఏళ్ల అమ్మాయికి మత్తు మందు ఇచ్చి చంపేశారు. ఇంత వరకూ డిప్యూటీ సీఎం ఆ కుటుంబాన్ని పరామర్శించలేదన్నారు. హిందూపురంలో అత్తా కోడళ్లపై అత్యాచారం చేస్తే అక్కడ ఉన్న ఎమ్మెల్యే ఆవైపు తొంగి చూడలేదు. ఇప్పటికైనా మీలో చలనం వచ్చి ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దిశా చట్టం అమలు చేసి మహిళలు, చిన్నారులపై హత్యలను నియంత్రించి రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలన్నారు.